తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం - 25- ఏప్రిల్ 2026 | సంపుటి : 3 | సంచిక : 327 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి

## విలీన డిమాండ్‌తో ఆత్మహత్యాయత్నం

## హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కన్నుమూసిన డ్రైవర్

## రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తత, చర్చలకు పిలుపు

**డెస్క్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఆర్టీసీ సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలనే డిమాండ్‌తో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నర్సంపేట డిపో డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ మృతి చెందారు. 80 శాతం కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.
గురువారం ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

మిగతా 2లో



ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియలు ఉద్రిక్తతల మధ్య పూర్తి

- మృతదేహం తరలింపుపై కార్మికులు–పోలీసుల మధ్య ఉద్రిక్తత
- విపక్షాల మద్దతు, కేంద్రమంత్రి బండి సంజయ్ ఆందోళన
- చర్చల అనంతరం కుటుంబ సమ్మతితో అంతిమకార్యాలు

2లో



## శంకర్‌గౌడ్ మృతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతాపం

- చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం అన్న భట్టి
- ప్రాణాలు తీసుకోవడం సరైన మార్గం కాదని హితవు
- ఆర్టీసీ బలోపేతానికి హామీ

2లో





# సైబరాబాద్‌లో నంబర్ ప్లేట్లపై కొరడా

## నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై భారీ జరిమానాలు

## తప్పుడు నంబర్ ప్లేట్లపై పోలీసుల దాడి

## ఒకే రోజులో 383 కేసులు నమోదు

## హైట్రాఫిక్ ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహణ

**హైదరాబాద్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లేట్లపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ విభాగం నిన్నటి రోజున అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో భారీ స్థాయిలో తనిఖీలు చేపట్టింది. నంబర్ ప్లేట్లు లేకపోవడం అస్పష్టంగా ఉండటం లేదా ప్లేట్లను మార్చడం వంటి ఉల్లంఘనలను పోలీసులు గుర్తించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

మిగతా 2లో



# బస్తీల్లో తాగునీటి సౌకర్యాల విస్తరణ

- కిషన్ రెడ్డి కార్యక్రమం
- సికింద్రాబాద్ నియోజకవర్గంలో బోర్‌వెల్లుల ప్రారంభం
- వేసవిలో నీటి సమస్యలకు ఉపశమనం లక్ష్యం
- పలుచోట్ల బస్తీలకు తాగునీటి అందుబాటు పెంపు

**సికింద్రాబాద్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి సికింద్రాబాద్ లో పలు బస్తీల్లో తాగునీటి సౌకర్యాలను విస్తరించే కార్యక్రమాన్ని చేపట్టారు. రహ్మత్ నగర్, కార్మిక నగర్, ఇందిరా నగర్ దశలు 1, 2 ప్రాంతాల్లో పవర్ బోర్‌వెల్లులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

మిగతా 2లో

# ఆర్టీసీ సంక్షోభంపై కీలక మలుపు

- చర్చలు తుదిదశకు – ప్రభుత్వం సానుకూల సంకేతాలు
- భట్టి విక్రమార్క నేతృత్వంలో సచివాలయంలో మారథాన్ చర్చలు
- 32 డిమాండ్లలో 29పై అంగీకారం – మిగిలిన కీలక అంశాలపై తీవ్ర చర్చ
- శంకర్‌గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం, ఉద్యోగ హామీతో ప్రభుత్వ నిర్ణయం



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులకు పరిష్కారం కనుగొనే దిశగా సచివాలయంలో జరిగిన చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రుల బృందం, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య జరిగిన ఈ సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. ప్రభుత్వ ప్రతినిధులు, కార్మిక సంఘాల నేతలు ఎదురెదురుగా కూర్చుని సమస్యలపై సమగ్రంగా చర్చించడం విశేషంగా మారింది.

మిగతా 2లో



# ఇండియా ఫార్మా ఎక్స్‌పో–2026 ఘనంగా ప్రారంభం

- తెలంగాణ ఫార్మా హబ్‌గా ఎదుగుతోంది
- హైటెక్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు
- ఫార్మా సంస్థల స్టాళ్ల సందర్శన, ఉత్తమ సంస్థలకు పురస్కారాలు
- నాణ్యత, భద్రతపై రాజీ ఉండదని స్పష్టం

**హైదరాబాద్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇండియా ఫార్మా ఎక్స్‌పో-2026 కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై ఫార్మా రంగ అభివృద్ధిపై కీలక సందేశాలు ఇచ్చారు.
ఈ సందర్భంగా మంత్రి ఫార్మా, అనుబంధ సంస్థల స్టాళ్లను సందర్శించి, పరిశ్రమలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలకు పురస్కారాలు ప్రదానం చేశారు. పరిశ్రమ నాయకులు, నిపుణులతో సమావేశమై భవిష్యత్ అభివృద్ధి దిశగా చర్చలు జరిపారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణను ప్రపంచ స్థాయి ఫార్మా కేంద్రంగా అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో 1500కు పైగా యూనిట్లు ఏపీఐలు, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, వైద్య పరికరాలను ఉత్పత్తి

మిగతా 2లో

# మిలియన్ మార్చ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కు భారీ ఊరట

## హైకోర్టు కీలక తీర్పు – కేసులన్నీ కొట్టివేత

## ట్యాంక్‌బండ్ ఘటనపై నిందితుల జాబితా నుంచి విముక్తి

## దీర్ఘకాల న్యాయ పోరాటానికి ముగింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** 2011లో జరిగిన మిలియన్ మార్చ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఈ ఘటనకు సంబంధించి నమోదైన కేసులను హైకోర్టు పూర్తిగా కొట్టివేసింది. మిలియన్ మార్చ్ సందర్భంగా ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సమయంలో పోలీసులు పలు కేసులు నమోదు చేసి, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను కూడా నిందితులుగా చేర్చారు. ఈ కేసులు దీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో విచారణలో కొనసాగుతున్నాయి.

మిగతా 2లో



# పర్యావరణవేత్త సత్యనారాయణకు ప్రభుత్వ వైద్యం



## ఆరోగ్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి

## నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సకు ఏర్పాట్లు

## ప్రభుత్వ ఖర్చులతో వైద్యం నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** పర్యావరణవేత్త, జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ ఆరోగ్యం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఓఎస్డీ వేముల శ్రీనివాసులు దుశ్చర్ల సత్యనారాయణతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అవసరమైన వైద్య సేవలను తక్షణమే అందించాలని సూచనలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో దుశ్చర్ల సత్యనారాయణకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అన్ని ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని అధికారులు వెల్లడించారు. ఆరోగ్య సేవలు అందించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రముఖుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్ జిల్లా నర్సంపేట బస్టాండ్ ఎదుట శంకర్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఆర్టీసీ విలీనంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఆయన ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మంటలు చెలరేగిన వెంటనే తోటి కార్మికులు, పోలీసులు స్పందించి మంటలను ఆర్పారు. తీవ్రంగా గాయపడిన శంకర్‌గౌడ్‌ను మొదట వరంగల్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

శంకర్‌గౌడ్ మృతితో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె మరింత ఉద్రిక్తంగా మారింది. ఇదే తరహాలో నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో మరో ఇద్దరు డ్రైవర్లు కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కార్మికుల్లో ఉన్న ఆందోళనను సూచిస్తోంది. ఇక సమ్మె రెండో రోజుకూడా కొనసాగింది. ప్రభుత్వం తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల సహాయంతో, పోలీసు బందోబస్తు మధ్య కొంతమేర బస్సులు నడిపినట్లు అధికారులు తెలిపారు. అయితే బస్సుల కొరతతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ప్రైవేటు వాహనదారులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ పరిణామాలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. కార్మికులు ఆత్మహత్యల వంటి తీవ్ర చర్యలకు పాల్పడవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల నాయకులతో మంత్రుల కమిటీ చర్చలు జరపనుండగా, ఈ సమావేశం కీలకంగా మారింది శంకర్‌గౌడ్ మృతికి ప్రభుత్వ వైఖరే కారణమని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశాయి. ప్రభుత్వంకార్మిక సంఘాల మధ్య చర్చలు ఈ సంక్షోభానికి పరిష్కారం చూపుతాయా అన్నది ఇప్పుడు ప్రధానంగా మారింది.

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియలు ఉద్రిక్తతల మధ్య పూర్తి

**వరంగల్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో బలవన్మరణానికి పాల్పడిన డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియలు తీవ్ర ఉద్రిక్తతల మధ్య పూర్తయ్యాయి. మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తరలించాలన్న కార్మికులు, కుటుంబ సభ్యుల డిమాండ్ ఉద్రిక్తతలకు దారితీసింది. హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని నర్సంపేట మండలం ముత్తోజిపేటలోని ఆయన కుమార్తె ఇంటికి తీసుకువచ్చారు. అక్కడికి చేరుకున్న ఆర్టీసీ కార్మికులు, విపక్ష నేతలు, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు అనుమతించాలని పోలీసులను కోరారు. అయితే పోలీసులు అనుమతి నిరాకరించడంతో నర్సంపేట-మల్లంపల్లి రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులు,



రాజకీయ కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నేతలను కూడా పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కార్మికులు, కార్యకర్తలు నినాదాలతో ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం ముత్తోజిపేటకు చేరుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్ శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళులు అర్పించారు. డిపోకు తీసుకెళ్లకుండా అడ్డుకోవడంపై పోలీసులను ప్రశ్నిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, కుటుంబ సభ్యుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల అనంతరం పోలీసులు, కుటుంబ సభ్యులు, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య చర్చలు జరగడంతో సమస్య పరిష్కారమైంది. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు అంగీకరించగా, శంకర్ గౌడ్ అంతిమయాత్ర నిర్వహించి చివరి కార్యక్రమాలు పూర్తిచేశారు. ఇక శంకర్ గౌడ్ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుందని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటామని తెలిపారు.

## శంకర్‌గౌడ్ మృతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతాపం

**డెస్క్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ మృతిపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సచివాలయంలో మంత్రుల బృందంతో కలిసి ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలతో భేటీ అయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమస్యలు ఎంత క్లిష్టమైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని భట్టి విక్రమార్క హితవు పలికారు. ఇది ప్రజల ప్రభుత్వం అని, ఎవరినీ శత్రువులుగా చూడబోమని స్పష్టం చేశారు. గత పదేళ్లలో ఆర్టీసీ పరిస్థితి దెబ్బతిన్నదని, ఆ సమయంలో కార్మికుల పట్ల పాలకులు కఠినంగా వ్యవహరించారని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అలాంటి విధానాన్ని అనుసరించదని భరోసా ఇచ్చారు.

వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారం, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. శంకర్‌గౌడ్ మృతి బాధాకరమని పేర్కొన్నారు.



ఆర్టీసీని బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య జరగబోయే చర్చలు కీలకంగా మారగా, ఈ సమావేశాలు ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి మార్గం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## ఇండియా ఫార్మా ఎక్స్‌పో–2026 ఘనంగా ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నాయని తెలిపారు. 80కి పైగా టెస్టింగ్ కేంద్రాలు, 50 వేలకుపైగా మెడికల్ షాపులు పనిచేస్తున్నాయని వివరించారు.

కరోనా సమయంలో ప్రపంచానికి ఔషధాలు సరఫరా చేయడంలో తెలంగాణ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరం ఫార్మా, ఆరోగ్య రంగాల్లో ప్రపంచానికి నమ్మకమైన కేంద్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. నాణ్యత, భద్రత, పారదర్శకత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. నకిలీ, నాసిరకం మందులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఫార్మా ఎక్స్‌పోలు పరిశోధన, నవీనత, భాగస్వామ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఫార్మా రంగాన్ని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫార్మా పరిశ్రమకు చెందిన ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మా హబ్‌గా నిలబెట్టే దిశగా ఈ ఎక్స్‌పో కీలక వేదికగా నిలిచింది.

## పర్యావరణవేత్త సత్యనారాయణకు ప్రభుత్వ వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

దుశ్చర్ల సత్యనారాయణ వంటి సామాజిక సేవకులు సమాజానికి చేసిన సేవలను గుర్తిస్తూ వారికి అవసరమైన సహాయం అందించడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. ఈ చర్యతో ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రజా సేవకుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశం వెళ్లింది.

## మిలియన్ మార్చ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టులో కీలక వాదనలు వినిపించారు. సంఘటనలతో తమకు ప్రత్యక్ష సంబంధం లేదని, రాజకీయ కారణాలతోనే కేసుల్లో తమ పేర్లు చేర్చారని వివరించారు. ఆధారాలు లేకుండా కేసులు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. వాదనలు, పత్రాలను పరిశీలించిన హైకోర్టు న్యాయస్థానం ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని తేల్చింది. దీంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై నమోదైన కేసులను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. ఈ నిర్ణయం వారికి గణనీయమైన ఉపశమనాన్ని కలిగించింది. దీంతో సంవత్సరాలుగా కొనసాగుతున్న న్యాయపరమైన వ్యవహారం ముగిసినట్లయింది. ఈ కేసులు రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకున్న నేపథ్యంలో హైకోర్టు తీర్పు చర్చనీయాంశంగా మారింది. ఈ తీర్పు తర్వాత బీఆర్ఎస్ వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతుండగా, రాజకీయంగా కూడా ఈ పరిణామం ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇకపై ఈ కేసుకు సంబంధించిన అన్ని న్యాయపరమైన ప్రక్రియలు ముగిసినట్లుగా భావిస్తున్నారు.

## మారుమూల గ్రామాల్లో 'బిఎస్ఎన్ఎల్' సేవలు మెరుగుపరచాలి

- ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో అధికారులకు సూచించిన టీఏసీ సభ్యులు

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 24(తెలంగాణ ముచ్చట్లు )**



గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, వినియోగదారులకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించాలని టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) సభ్యులు బిఎస్ఎన్ఎల్ అధికారులను కోరారు. శుక్రవారం ఖమ్మంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో టీఏసీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న నెట్‌వర్క్ ఇబ్బందులపై కమిటీ సభ్యులు అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

సమావేశంలో కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, రంజిత్ నాయక్, మచ్చా రామారావు, సత్యనారాయణ రెడ్డి తదితరులు మాట్లాడుతూ పలు కీలక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**అనేక అంశాల ప్రస్తావన.**

కూసుమంచి ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలు అత్యంత పేలవంగా ఉన్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని, వినియోగదారుల కోసం బీఎస్ఎన్ఎల్ ఖమ్మం కార్యాలయంలో సిమ్ కార్డులు నిరంతరం అందుబాటులో ఉంచాలని కోరారు. బోనకల్, చింతకాని మండలాల్లో నెట్‌వర్క్ పరిధిని విస్తరించేందుకు మరిన్ని నూతన టవర్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గోవిందాపురం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ అస్సలు అందడం లేదని, అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి పరిశీలించాలని కోరారు. వైరా, బ్రాహ్మణపల్లి, ఉప్పలమడక గ్రామాల్లో నెలకొన్న సిగ్నల్ సమస్యలను పరిష్కరించాలన్నారు.

**నూతన టవర్ల ఏర్పాటుకు తీర్మానం**

ఖమ్మం రూరల్ మండలం కస్నా తండా, నగరంలోని ఇందిరానగర్, గోశాల ప్రాంతాల్లో మెరుగైన సిగ్నల్ కోసం నూతన టవర్ల ఏర్పాటు అంశాన్ని త్వరితగతిన ఆచరణలోకి తేవాలని సమావేశం తీర్మానించింది.

**అధికారుల అభయం..**

టీఏసీ సభ్యుల విజ్ఞప్తులపై బిఎస్ఎన్ఎల్ డీజీఎం రాజశేఖర్, ఏజీఎం స్పందిస్తూ.. సమస్య తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో అవసరమైన చోట కొత్త టవర్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ రఘురాంరెడ్డి సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, సిగ్నల్, ఇంటర్నెట్ సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## సైబరాబాద్‌లో నంబర్ ప్లేట్లపై కొరడా

(మొదటి పేజీ తరువాయి)

ఈ తనిఖీలను ప్రధానంగా రద్దీగా ఉండే ప్రాంతాలలో నిర్వహించారు. పటాన్‌చెరు, బీహెచ్ఈఎల్ రోడ్డు, మియాపూర్, జేఎన్టీయూ ప్రాంతాలలో పోలీసులు నిఘా పెట్టారు. అలాగే కూకట్‌పల్లి, బాలానగర్, జీడిమెట్ల, మేడ్చల్ వంటి కీలక కూడళ్లలో వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. చాలా వాహనాలు నంబర్ ప్లేట్లు సరిగ్గా లేవని లేదా అంకెలు కనిపించకుండా ఉన్నాయని పోలీసులు గమనించారు. నేరాలు జరిగినప్పుడు నంబర్ ప్లేట్లు లేకపోవడం వల్ల నిందితులను గుర్తించడం కష్టమవుతోందని అందుకే ఈ డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సామాన్య ప్రజల భద్రత కోసం ఇటువంటి తనిఖీలు అవసరమని పోలీసులు అభిప్రాయపడ్డారు.

ఒక్క రోజులోనే సైబరాబాద్ వ్యాప్తంగా మొత్తం 383 కేసులు నమోదయ్యాయి. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల నుండి పోలీసులు 80,600 రూపాయల జరిమానా వసూలు చేశారు. వాహనాల నంబర్ ప్లేట్లపై అంకెలు స్పష్టంగా ఉండాలని ఏవైనా అదనపు అలంకరణలు లేదా బొమ్మలు ఉంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



చాలా మంది తమ వాహనాల నంబర్ ప్లేట్లను వక్రీకరిస్తూ ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకోవాలని చూస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా వెనుకాడబోమని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. నంబర్ ప్లేట్ల ప్రదర్శన అనేది కేవలం ఒక నియమం మాత్రమే కాదు అది పౌరుల భద్రతకు అత్యంత అవసరమని పోలీసులు వివరించారు. వాహన చోదకులు తమ వాహనం నంబర్ స్పష్టంగా కనిపించేలా చూసుకోవడం బాధ్యతగా భావించాలని కోరారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ నిబంధనలను ఎక్కువగా ఉల్లంఘిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న వారిపై సీసీటీవీ కెమెరాల ద్వారా కూడా నిఘా ఉంచుతున్నట్లు అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వారు తెలిపారు. ప్రజా రక్షణ నేరాల నియంత్రణలో భాగంగా ఈ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ కొనసాగుతోంది. వాహనదారులు చట్టానికి లోబడి ప్రయాణించాలని పోలీసులు సూచించారు. సరైన నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేయడానికి కూడా వెనుకాడబోమని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం విజ్ఞప్తి చేసింది. నంబర్ ప్లేట్ల విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించవద్దని అది మీ వాహన గుర్తింపునకు కీలకమని గుర్తు చేశారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలని ప్రజలను కోరారు.

## ఆర్టీసీ సంక్షోభంపై కీలక మలుపు

(మొదటి పేజీ తరువాయి)

ఈ చర్చల్లో ఆర్టీసీ జేఏసీ నేతలు మొత్తం 32 డిమాండ్లను ప్రభుత్వ ముందుంచగా, అందులో 29 డిమాండ్లపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. మిగిలిన మూడు కీలక అంశాలైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించడం, పీఆర్సీ మరియు డీఏ అమలు వంటి విషయాలపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ అంశాలపై తుది నిర్ణయం తీసుకునే దిశగా ఇరు పక్షాలు చర్చలు ముమ్మరం చేస్తున్నాయి. చర్చలకు ముందు ఆర్టీసీ జేఏసీ నేతలు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీతో సమావేశమై తమ డిమాండ్లను వివరించారు. ఆ తరువాత మంత్రుల బృందంతో సమావేశమై అన్ని అంశాలపై చర్చించారు. మధ్యాహ్నం విరామం అనంతరం కూడా చర్చలు కొనసాగడం ఈ అంశం ప్రాధాన్యతను తెలియజేస్తోంది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కార్మికులు ఆత్మహత్యల వంటి నిర్ణయాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ఆర్టీసీ రాష్ట్రంలో అతిపెద్ద ప్రజా రంగ సంస్థగా ఉండటంతో దాన్ని బలోపేతం చేయడం అందరి బాధ్యత అని ఆయన అన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలపై చిత్తశుద్ధితో స్పందిస్తోందని స్పష్టం చేశారు. కార్మికులు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనలను వ్యక్తం చేయాలని, ఆవేశ పూరిత చర్యలకు పాల్పడకూడదని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యలు పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తున్నాయని ఆయన హెచ్చరించారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి ప్రకటించారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.10 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు కల్పిస్తామని తెలిపారు. అంతేకాకుండా ఆర్టీసీ జేఏసీ నేతలు కూడా కార్మికుల నుంచి విరాళాలు సేకరించి కుటుంబానికి అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఉద్యోగి నుంచి రూ.200 నుంచి రూ.300 వరకు సేకరించి లక్షల రూపాయల సాయం అందించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ సమావేశానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్ తదితరులు హాజరయ్యారు. చర్చలు సానుకూల వాతావరణంలో సాగుతున్న నేపథ్యంలో త్వరలోనే తుది నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ సమ్మె రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఈ చర్చలు అత్యంత కీలకంగా మారాయి. ప్రభుత్వంకార్మిక సంఘాల మధ్య అవగాహన ఏర్పడితే సమ్మెకు ముగింపు పలికే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బస్తీల్లో తాగునీటి సౌకర్యాల విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి కాలంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉండే ప్రాంతాలను గుర్తించి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా సాధారణ నీటి సరఫరా అందుబాటులో లేని బస్తీలకు ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు.

బోర్‌వెల్లుల ప్రారంభంతో స్థానిక ప్రజలకు తాగునీరు సులభంగా అందే పరిస్థితి ఏర్పడనుంది. నీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా బస్తీ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు. వేసవిలో పెరిగే నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి మరిన్ని ప్రాజెక్టులను చేపట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం.

ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టడం ప్రభుత్వ బాధ్యతగా ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రతి బస్తీకి తాగునీటి సౌకర్యాలు అందేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ బోర్‌వెల్లుల ప్రారంభంతో బస్తీల్లో నీటి సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. వేసవి కాలంలో ఈ సౌకర్యాలు వారికి ఎంతో ఉపశమనం కలిగించనున్నాయి.



# నిరుపేద గిరిజన మహిళ కుటుంబానికి చేయుత

**భీమదేవరపల్లి,ఏప్రిల్ 24(తెలంగాణ ముచ్చట్లు):** గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఇటీవల అజ్మీర సోనీ w/o రాజు అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ పరిస్థితి, ఇద్దరు చిన్న పిల్లలను చూసి చలించిన గ్రామస్తులు తమవంతు సహకారం అందించి 30,000 రూపాయలను ఈరోజు పిల్లలు పేరు మీద బ్యాంకు లో డిపాజిట్ చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ముందుండి నడిపించిన 5వ వార్డ్ సభ్యుడు కాసనగొట్టు సాయిరాం ను గ్రామస్తులంతా అభినందించారు..పేద కుటుంబానికి సహకరించిన దాతలందరికి ఈ సందర్భంగా సాయిరాం కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచర్ల సారయ్య గారు వార్డు సభ్యులు సంగ ఐలయ్య మరియు గ్రామస్తులు ముత్యాల రవి బానోతు గంగయ్య .రాణి .ప్రవీణ్. వినయ్ .గ్రామస్తులు పాల్గొనడం జరిగింది





# బడి బస్సులు భద్రంగా ఉంచండి.!


- **జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు.**
- **విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం.**

**సత్తుపల్లి, ఏప్రిల్ 24(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బడి బస్సులను పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని జిల్లా రవాణా శాఖ అధికారి జే.ఎన్. శ్రీనివాసరావు సూచించారు. తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల నిర్వహణ సంఘం (టీఆర్ఎస్ఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యే ముందు, మే 15వ తేదీ తర్వాత బడి బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈలోపు అన్ని వాహనాలకు అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి, రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా ఉంచాలని యాజమాన్యాలకు సూచించారు. బ్రేకులు, టైర్లు, లైట్లు వంటి భద్రతా ప్రమాణాలు సరిగా లేని బస్సులను నడిపితే వాటిని సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలని, వారి పని తీరుపై యాజమాన్యాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ జిల్లా నాయకులు గుర్రం కాంతారావు, నాయుడు వెంకటేశ్వరరావు, ఎలిశెట్టి నాసరయ్య తదితరులు, జిల్లాలోని వివిధ డివిజన్ల ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా రవాణా శాఖ అధికారిని ఘనంగా సత్కరించారు.

# ఆయిల్ ఫామ్ పంటతో అధిక లాభాలు

- **రైతులకు అవగాహన కల్పించిన అధికారులు**

**పెద్దమందడి,ఏప్రిల్24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలోని రైతు వేదికలో ఆయిల్ ఫామ్ పంట సాగు ద్వారా లభించే లాభాలపై రైతులకు వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని ఆసక్తి చూపారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ పంట సాగు రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని అందించే పంటగా నిలుస్తుందని తెలిపారు. తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు



పొందే అవకాశముందని, సరైన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వివరించారు.ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం పలు రకాల సబ్సిడీలు, సాంకేతిక సహాయం అందిస్తున్నదని చెప్పారు.రైతులు ఈ అవకాశాలను వినియోగించుకుని తమ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.అలాగే, ఆయిల్ ఫామ్ పంట సాగులో అనుసరించాల్సిన విధానాలు, నీటి నిర్వహణ, ఎరువుల వినియోగం, వ్యాధి నియంత్రణ వంటి అంశాలపై రైతులకు వివరంగా తెలియజేశారు. రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో ఆయిల్ ఫామ్ పంటపై అవగాహన పెరిగి, సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రామాంజనేయులు, ఉద్యానవన అధికారి విజయ్ భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్, జోనల్ మేనేజర్ రాకేష్, ఏరియా మేనేజర్ కేతన్ రెడ్డి, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్, ఏఈఓ, చెన్నారాయుడు, రైతులు పాల్గొన్నారు.



# 108లోనే పుట్టిన పాప

- **తల్లి–శిశువు క్షేమం**

**అశ్వరావుపేట, ఏప్రిల్ 24(తెలంగాణ ముచ్చట్లు):** అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి గర్భిణికి సురక్షిత ప్రసవం నిర్వహించారు. గుంటిమడుగు గ్రామానికి చెందిన కె. మంగా (22)కు తీవ్ర ప్రసవ నొప్పులు రావడంతో వెంటనే సమాచారం అందుకున్న సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. గ్రావిడా 2 గర్భిణిగా ఉన్న ఆమెకు పూర్తి గర్భకాలం నిండకముందే నొప్పులు ప్రారంభమవడంతో, అంబులెన్స్‌లోనే వైద్యసహాయం అందించారు. బాధితురాలిని ఎడమ వైపుకు పడుకోబెట్టి, అనంతరం లిథోటమీ స్థితిలో ఉంచి ప్రసవానికి సహకరించారు. ఈ క్రమంలో ఆడ శిశువు సురక్షితంగా జన్మించింది. పుట్టిన వెంటనే శిశువు ఏడుస్తూ స్పందించడంతో పాటు ఆరోగ్యంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. శిశువును పొడిగా, వెచ్చగా ఉంచి అవసరమైన ప్రాథమిక చికిత్స అందించారు. శిశువు బరువు 3.01 కిలోలు కాగా, ఏపీజీఏఆర్ స్కోరు 10గా నమోదైంది. తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సేవలో ఈఎంటీ ఎం. సుహాసిని, పైలట్ ఎం. నాగేంద్ర బాబు పాల్గొన్నారు. పర్యవేక్షణలో డా. మనీష్ ఉన్నారు.

# ఆత్మబలిదానాలు వద్దు



- **జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం**
- **హక్కుల కోసం పోరాటం చేద్దాం...**
- **ఆర్టీసీ కార్మికులకు దళిత హక్కుల పోరాట సమితి మద్దతు**

**స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కొనసాగుతున్న ఆందోళనకు హనుమకొండ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ, కార్మికులు హక్కుల కోసం ధైర్యంగా పోరాడాలని, కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. "ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగడదాం... కార్మికుల పొట్ట కొట్టే విధానాలను ప్రశ్నిద్దాం. కానీ ప్రాణత్యాగం సమస్యకు పరిష్కారం కాదు. మీ ప్రాణం అమూల్యమైనది. మీరు కోల్పోతే నష్టపోయేది మీ కుటుంబమే తప్ప ప్రభుత్వం కాదు" అని ఆవేదనతో తెలిపారు.
ఆర్టీసీ కార్మికులారా... ఆవేదనలో ఆత్మహత్య శరణ్యం అనుకోకండి. మీరు గతంలో ఎన్నో హక్కులు సాధించారు. మీ వెనుక మీ కుటుంబం ఉంది... మీకు అండగా మేమున్నాము. న్యాయమైన డిమాండ్ల కోసం మీరు చేస్తున్న పోరాటంలో మేము మీ వెంటే ఉంటాం. ప్రభుత్వం దిగివచ్చి మీ సమస్యలు పరిష్కరించే వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.
గత ప్రభుత్వంలో కూడా ఆర్టీసీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, న్యాయం జరగకపోవడంతో ఈ ప్రభుత్వాన్ని ఆశ్రయించామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కూడా డిమాండ్ల పరిష్కారంలో ఆలస్యం చేస్తోందని విమర్శించారు. జేఏసీ నాయకులతో వెంటనే చర్చలు జరిపి, కాలయాపన చేయకుండా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.
ఇటీవల నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మాహుతి ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వడంతో పాటు, కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు.
భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. "ధైర్యంగా ఉండండి... కలిసి పోరాడుదాం" అని కార్మికులకు పిలుపునిచ్చారు.



# వడదెబ్బ నివారణకు అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

**జమ్మికుంట టౌన్, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఎండాకాలం తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన "వడదెబ్బ ప్రమాదకరం – జాగ్రత్తలతో నివారణ సాధ్యం" అవగాహన పోస్టర్‌ను జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్‌తో కలిసి డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రావణ్ కుమార్ ఆవిష్కరించారు. ప్రజల్లో వడదెబ్బపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటీవలి రోజుల్లో ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయట తిరగడం ఆరోగ్యానికి హానికరమని, వడదెబ్బ వల్ల ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు. అత్యవసరం ఉంటేనే బయటకు రావాలని, బయటకు వచ్చినప్పుడు తలకు, చెవులకు గుడ్డ లేదా టవల్ కట్టుకోవడం ద్వారా ఎండ ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు.
అలాగే రోజంతా తగినంత నీరు తాగడం, నిమ్మరసం, మజ్జిగ వంటి శీతల పానీయాలను తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చని వివరించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే నీడ ఉన్న ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం, తేలికపాటి దుస్తులు ధరించడం వంటి సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు ఫిరోజ్, చింతల శ్రీనివాస్, సదానందం, ప్రతాప్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొని ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కుట్రలు విఫలం

- **బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్**

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరితమని, వాటికి హైకోర్టు తీర్పు గట్టి సమాధానమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ అన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేస్తున్న ప్రచారం పీసీ ఘోష్ నివేదికతో పూర్తిగా తేలిపోయిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నమని విమర్శించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ అసత్య ప్రచారాలకు చెక్ పెట్టిందని, ప్రతిపక్షాల రాజకీయ కుట్రలు విఫలమయ్యాయని తెలిపారు.




ఈ సందర్భంగా సింగిల్ విండో మాజీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం ఒక బ్యారేజ్ కాదని, మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 20 లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలు, సుమారు 250 మీటర్ల సొరంగంతో కూడిన విస్తృత ప్రాజెక్టు అని వివరించారు. మొత్తం 300 పిల్లర్లలో కేవలం రెండు పిల్లర్లకు పాక్షిక పగుళ్లు వచ్చినందుకు ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని ప్రచారం చేయడం దురుద్దేశపూరితమని అన్నారు.
ఇక రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇటీవల జరిగిన శంకర్ గౌడ్ ఘటనను ప్రస్తావిస్తూ, బాధిత కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం ఇవ్వడంతో పాటు కుటుంబ సభ్యుడికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో శ్రీపతి రవీందర్ గౌడ్, మేకల స్వప్న, తంగెడ నగేష్, కడారి రాజు, తంగెడ మహేందర్, గోల్లే మహేందర్, గుండేటి సతీష్, మదార్, మునిగడప లావణ్య, శేషగిరి, భాషా, బోయిన నీలా, కొమురయ్య యాదవ్, దుగ్యాని సమ్మయ్య, చెవుల కొమరయ్య, ఎర్రబెల్లి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**వేలేరు, ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని మల్లికుదుర్ల, సోడాషాపల్లి, గుండ్లసాగర్, శాలపల్లి, పీచర గ్రామాల్లో శుక్రవారం రోజున రైతులకు మద్దతుగా ఐకేపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.
ఈ కార్యక్రమాలకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై కేంద్రాలను ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పించడం ద్వారా వారికి మేలు జరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అధికారులు, ఐకేపి సెంటర్ నిర్వాహకులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా బీజేపీ భారీ ఆందోళన

■ బండి సంజయ్ తీవ్ర హెచ్చరిక

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణ శివార్లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో భారీ ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పాల్గొన్న కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, హైవే పక్కన డంపింగ్ యార్డ్ నిర్మించడం వల్ల పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని మండిపడ్డారు. చెత్త కుప్పల వల్ల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు చెత్త వేయడం వంటి నిరసనలు చేపడతామని




హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ రద్దు అయ్యే వరకు న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ ఆందోళనతో ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, స్థానిక ప్రజలు కూడా బీజేపీ నిరసనకు మద్దతు తెలిపారు.



## పాపక్కపల్లి మత్స్య సంఘ ఎన్నికలు ప్రశాంతంగా ముగింపు

■ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం పాపక్కపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినట్లు ఎన్నికల అధికారి నాగుల మనోజ్ తెలిపారు. ఎటువంటి ఉద్రిక్తతలు లేకుండా సజావుగా పోలింగ్ ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు. ఈ ఎన్నికల్లో సంఘ అధ్యక్షుడిగా పంజ రమేష్, ఉపాధ్యక్షుడిగా పుట్టకొక్కుల రమేష్, కార్యదర్శిగా పుట్టకొక్కుల రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. సభ్యుల ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గం ఎంపిక కావడం సంఘంలో ఐక్యతను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధి కోసం కృషి చేయాలని, మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి మెరుగుదల కోసం పలు కార్యక్రమాలు చేపట్టాలని ఎన్నికల అధికారి ఆకాంక్షించారు.

# ఘనంగా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ జన్మదిన వేడుకలు

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్ ప్రిన్సిపల్ మాట్ల సందీప్ కుమార్ జన్మదిన వేడుకలు స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నాయకులు పాల్గొని ప్రిన్సిపల్ మాట్ల సందీప్ కుమార్‌ను శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జ్యోతి బాపూలే జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రఘు చారి, ప్రధాన కార్యదర్శి చిలకామారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, మావునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాజరై ప్రిన్సిపల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు




మాట్లాడుతూ, మాట్ల సందీప్ కుమార్ విద్యారంగంలో చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఆయనకు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరగాలని ఆకాంక్షించారు.



## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొనసాగిస్తున్న సమ్మెకు హుజురాబాద్ నియోజకవర్గంలోని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నిర్వహించిన దీక్షలో పాల్గొని కార్మికులతో ఐక్యత వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించడం వంటి ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా వరంగల్ జిల్లా నర్సంపేట్ డిపోలో విధి నిర్వహణలో భాగంగా మరణించిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఎస్పీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ దొడ్డే సమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గిన్నారపు మహేందర్, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వేల్పుల మల్లేష్, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), నియోజకవర్గ అధ్యక్షుడు మంద సమ్మయ్య, ఎమ్మెల్యేఎంపీ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, రామ్ శ్రీనివాస్, మొలుగూరి రమేష్, ఆకునూరి అచ్యుత్, మామిండ్ల మల్లయ్య యాదవ్, గంగారపు ప్రవీణ్, మీడియా/సోషల్ మీడియా ఇన్చార్జ్ మంద జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు మహా ధర్నా..

■ ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ..

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 24(తెలంగాణ ముచ్చట్లు )**

రైతు ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మరియు వరికి మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వం దిగి వచ్చి ఖమ్మం జిల్లాలో పండిన అన్ని పంటలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు. వండి వార్చినా వడ్డించడం చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.. రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలి..రేవంత్ రెడ్డి అసమర్థ పాలన వల్లే రాష్ట్రంలో ఈ అరిష్టాలు జరుగుతున్నాయని అన్నారు.

మనిషిని మనిషి ముట్టుకునే పరిస్థితి లేని కరోనా లో కూడా ప్రతి గింజ కొనుగోలు చేసిన చరిత్ర కేసీఆర్ గారిది.షాపుల్లో లేని యూరియా యాపుల్లో లో ఎక్కడి నుంచి వస్తుంది. ఎప్పుడు కరెంట్ వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి దాపురించింది..







యూరియా ఇవ్వడం చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.. అన్ని కష్టాలు భరించి పంట పండిస్తే కొనుగోలు కేంద్రాలు కూడా తెరవట్లేదు.పార్టీలు మారడం తప్ప తుమ్మలకు ఏం అనుభవం ఉంది.. ప్రతి కొనుగోలు కేంద్రం దగ్గర రైతులు మంటలు మండిస్తారు..రైతులు ఎదురుదిరిగితే ఎట్లా ఉంటుందో మీకు తెలుసు.. తెలంగాణ ప్రజలు ఏం కోల్పోయారు ఇప్పుడు కల్లకు కట్టినట్టు కనబడుతుంది. తెలంగాణలో స్వర్ణ యుగం రావాలంటే మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి.. కమిషన్లు,పర్సంటేజ్ లు , భూముల మీదనే మంత్రులకు ఇంట్రెస్ట్ ఉంది.రైతు సమస్యల మీద మంత్రులకు ఇంట్రెస్ట్ లేదు అని దుయ్యబట్టారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తాత మధు ,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు ,మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య ,కందాల ఉపేందర్ రెడ్డి,మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ,మాజీ చైర్మన్లు కూరాకుల నాఘభూషణం, ఆర్ జె సి కృష్ణ,బచ్చు విజయ్ కుమార్,ఖమర్,నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మండల అధ్యక్షులు అజ్మీరా వీరు నాయక్, జిల్లా రైతు బంధు నాయకులు మంకెన్ రమేష్, మధిర డివిజన్ నాయకులు గడ్డం శ్రీనివాస్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఓ ఖమ్మం డిస్టిక్ కాన్ఫరెన్స్ గోడ పత్రిక ఆవిష్కరణ

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 24(తెలంగాణ ముచ్చట్లు )**

స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఖమ్మం యూనిట్ ఆధ్వర్యంలో మే 2 న భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే భారీ డిస్టిక్ కాన్ఫరెన్స్ యొక్క గోడపత్రికను ఎస్ ఐ ఓ తెలంగాణ కార్యదర్శి మహమ్మద్ హమ్మద్ స్థానిక ఎస్ ఐ ఓ కార్యాలయంలో విడుదల చేశారు. నేటి సమాజంలో మరియు యువతలో ఎన్నో మార్పులు చేర్పులు వస్తున్నప్పటికీ మనకు ఉన్న ధర్మ సందేశాన్ని మరియు మూలాలను యువత మరువరాదని గోడ పత్రిక ఆవిష్కరణ సందర్భంగా హమ్మద్ వివరించి సృష్టికర్త రంగును ఎంచుకోవడమే ఉత్తమమని వివరించారు.ప్రతి ముస్లిం యువత ఈ భారీ డిస్టిక్ కాన్ఫరెన్స్లో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుకున్నారు.దీనిలో ముఖ్యఅతిథిగా మహమ్మద్ అబ్దుల్ హఫీజ్ ఎస్ ఐ ఓ జాతీయ అధ్యక్షులు పాల్గొని యువతను ఉద్దేశించి సందేశం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామి హింద్ నగర అధ్యక్షులు జైనుల్ పాషా ఎస్ ఐ ఓ పట్టణ అధ్యక్షులు మతిన్ ,సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్,సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్,ఐట రీజనల్ సెక్రెటరీ అబ్దుల్ ముజీబ్, ఉసామా, ఖలిల్ అహ్మద్ ఖాన్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.






## సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ రవిచంద్ర

**ఖమ్మం బ్యూరో , ఏప్రిల్, 24(తెలంగాణ ముచ్చట్లు ):** ఎంపీ రవిచంద్ర సిఫార్సు మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం పంపిణీ చేశారు. ఈ మేరకు ఖమ్మం బుర్హాన్ పురంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూ. 8.50 లక్షల విలువైన చెక్కులను 19 మంది బాధితులకు అందజేశారు. మరో ఇద్దరికి ముందస్తు ఆపరేషన్ నిమిత్తం మంజూరైన రూ. 4 లక్షల విలువైన ఎల్ఓసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలు అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొంది, కోలుకున్న బాధితులను పరామర్శించి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మధిర మున్సిపల్ కౌన్సిలర్ వెన్నంశెట్టి అప్పారావు, మధిర పట్టణ బీఆర్ఎస్ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాసా రామారావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడిపోయిన గోపాలరావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# ఖమ్మంలో పలువురికి ఎంపీ రవిచంద్ర పరామర్శ

**ఖమ్మం బ్యూరో , ఏప్రిల్, 24(తెలంగాణ ముచ్చట్లు )**


ఇటీవల కాలంలో ఖమ్మం నగరంలో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం పరామర్శించారు. దంసలాపురం లోని అగ్రహారంలో నివాసం ఉండే ఆళ్ల వెంకటరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తనయులు శేష వర్ధన్ రెడ్డి, అంజిరెడ్డి, అల్లుళ్లు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, సత్య వర్ధన్ రెడ్డిలను ఓదార్చి, సానుభూతి తెలిపారు. అనంతరం శ్రీరామ్ హిల్స్ లో నివాసముండే కమర్తపు బతుకమ్మ కొద్ది రోజుల క్రితం చనిపోగా ఆమె తనయులు కమర్తపు మురళి, రవిందర్, కుటుంబ సభ్యులు కూరపాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ కూరపాటి ప్రదీప్ లను ఓదార్చి, సానుభూతి తెలిపారు.

అనంతరం మధిరలో నివాసముండే తన సమీప బంధువు ఆది వెంకటేశ్వర్లు (పెద్ద బ్బాయ్) ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి అంజలి ఘటించారు. అనంతరం ఆయన కుమారులు, కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమాల్లో ఎంపీ రవిచంద్ర వెంట మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేటర్లు సాగర్, గుణ చరిత్, మహేష్ తదితరులు ఉన్నారు.



# మంత్రి అడ్లూరికి వినతి అందజేసిన బిఎన్ఆర్కెఎస్ నాయకులు

